క్లుప్తంగా

ఘనంగా హరిద్ర శృంగారార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగారార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ.. ఆలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు శీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగారార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బండ్లమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

నేడు గుండె వ్యాధులపై అవగాహన సదస్సు

రేపల్లె రూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రేపల్లె బ్రాంచ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి 8 గంటలకు గుండెకు సంబంధించిన వ్యాధులపై ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వివిధ వైద్యశాలల వైద్యులకు సదస్సు నిర్వహించనున్నట్లు ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వసంతం వీరరాఘవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండె జబ్బులపై డాక్టర్ నాగశ్రీ హరిత, పిల్లల గుండె జబ్బుల ఆపరేషన్‌పై డాక్టర్ భరత్ సిద్దార్ధ, పిల్లల్లో మూర్ఛవాధి, మందుల వినియోగంపై డాక్టర్ హరిణి వివరిస్తారని, సదస్సులో వైద్యులు పాల్గొనాలని పేర్కొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

కొల్లూరు : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని కొల్లూరు పోలీసులు అరెస్టు చేసిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని పెసర్లంకకు చెందిన శొంఠి కర్ణుడు మద్యం దుకాణాల్లో.. మద్యం సీసాలు కొనుగోలు చేసి అమ్మకాలు చేస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ రవీంద్రరెడ్డి తన సిబ్బందితో అతని దుకాణంలో సోదాలు జరిపారు. 20 మద్యం సీసాలు దుకాణంలో లభ్యమవడంతో అతనిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేశారు. నిందితుడిని తెనాలి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెక్‌పోస్టుల్లో నగదు పట్టివేత

తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీల్లో నగదు పట్టుబడుతోంది. మండలంలోని సంగంజాగర్లమూడి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో గురువారం రాత్రి ఓ కారులో రూ. రెండు లక్షల నగదును పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలానే జేఎంజే కళాశాల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో శుక్రవారం త్రీ టౌన్ పోలీసుల తనిఖీల్లో రూ. 3.50 లక్షలను పోలీసులు గుర్తించి స్వాధీన పర్చుకున్నారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

కొల్లిపర: బాకీదారులు డబ్బులు అడగడంతో పాటు దౌర్జన్యం చేయడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కొల్లిపరకి చెందిన ఆయోద్య శివరామకృష్ణ (28) ఆదే గ్రామానికి చెందిన లింగాల శివరామకృష్ణ, కొల్లిపర శేషులకు బాకీ ఉన్నాడు. దీంతో ఇద్దరు డబ్బులు అడగటంతో పాటు కలసి కొట్టడంతో ఆయోద్య శివరామకృష్ణ మనస్థాపానికి గురయ్యాడు. దీంతో గురువారం రాత్రి తన గృహంలో తాటిదూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు తలుపు తీయగా శివరామకృష్ణ ఉరివేసుకుని కనిపించటంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శివరామకృష్ణ కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవీంద్రరెడ్డి తెలిపారు.

మజ్జిగ సీసాలు పంపిణీ



తెనాలిఅర్బన్: గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని రత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టౌన్ చర్చి వద్ద శుక్రవారం మధ్యాహ్నం 1500 మజ్జిగ సీసాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు దేవరపల్లి టైటస్ మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తమ సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ సీసాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. అలాగే అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సంఘ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయం

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

భట్టిప్రోలు: ఏసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని దైవ సందేశకులు వాక్యోపదేశం చేశారు. మానవుల పాప పరిహారార్థం ప్రభువైన ఏసుక్రీస్తు శిలువ మరణం పొందారని వివరించారు. గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భట్టిప్రోలు క్రీస్తు రక్షకుని దేవాలయంలో విచారణ గురువు రవికుమార్‌రెడ్డి, ధ్యాన మందిరం నిర్వాహకులు మార్టిన్, సహాయ గురువు బిబిన్ దైవ సందేశమిచ్చారు. విచారణ గురువు రవికుమార్‌రెడ్డి శిలువ మోశారు. స్థానిక క్రీస్తు భవన్ నుంచి ప్రారంభమైన శిలువ ధారణ కార్యక్రమం బస్టాండ్ సెంటర్, మార్కెట్ రోడ్డు, చావలి బస్టాండ్, రథం సెంటర్, రైల్వే గేట్ సెంటర్ మీదగా గమ్యస్థానం చేరుకుంది. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ శిలువ చేతబూని ఏసుక్రీస్తు నామస్మరణ చేశారు. ప్రపంచానికి శాంతి సందేశాన్నిస్తూ ఏసుక్రీస్తు చేసిన మహా త్యాగానికి గుడ్ ఫ్రైడే ప్రతీక అని దైవ జనులు తమ సందేశాన్ని అందజేశారు. స్థానిక సావార్తిక లూథరన్ సంఘం-క్రీస్తు లూథరన్ దేవాలయంలో గురు మండల అధ్యక్షుడు రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ దైవ సందేశమిచ్చారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

పిట్టలవానిపాలెం: మండలంలోని క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దైవ సేవకులు క్రీస్తు సందేశమిచ్చారు. గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను విశ్వాసులకు వివరించారు. ప్రభువు ఏసుక్రీస్తు శిలువ వేయబడిన శుక్రవారం గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటామని, పునరుత్థానుడైన రోజు ఆదివారం ఈస్టర్ పండగగా జరుపుకోవడం జరుగుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

రేపల్లె రూరల్: క్రీస్తు సూక్తులు ప్రతి ఒక్కరూ పాటించి శాంతి మార్గంలో నడవాలని ఐఆర్‌ఈఎఫ్ డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని ఐఆర్‌ఈఎఫ్ చర్చిలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బిషప్ క్రీస్తు సందేశాన్నిచ్చారు. తోటివారిపట్ల శాంతి, కరుణ, దయ చూపాలన్నారు. సర్వమానవాళి రక్షణకై ఏసుప్రభువు తన రక్తం చిందించారన్నారు. ద్వేషభావాలను వీడి ప్రతి ఒక్కరితో ప్రేమానురాగాలతో మెలగాలన్నారు. క్రీస్తు మార్గాన్ని ఆచరించి సత్ప్రవర్తనతో మెలగాలని చెప్పారు. క్రీస్తు గీతాలను ఆలపించారు. పట్టణంలోని ఆర్‌సీఎం చర్చిలో పాస్టర్ జోజిరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు శిలువను పుర వీధుల్లో మోశారు. పట్టణం, మండలంలోని పలు చర్చిలలో గుడ్‌ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రార్థనలు చేశారు.



భట్టిప్రోలు: ఏసుక్రీస్తు వేషధారణలో శిలువ మోస్తూ..

ప్రత్యేక ప్రార్థనలు

కొల్లూరు : గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం మండలంలోని అన్ని ప్రార్థన మందిరాలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత ప్రబోధకులు, పాస్టర్లు దైవ సందేశమిచ్చారు.

క్రీస్తు ఆరాధానలు

చెరుకుపల్లి: మండలంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు శుక్రవారం అన్ని చర్చిల్లో నిర్వహించారు. పలు చర్చిల్లో క్రీస్తు వేషాధారణలో శిలువ మోస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. ఆయా చర్చిల్లో పాస్టర్‌లు క్రీస్తు సందేశాన్ని అందించి గుడ్ ఫ్రైడే విశిష్టతను వివరించారు.

క్రీస్తు శిలువ ప్రదర్శన

కూచిపూడి(వేమూరు): అమర్తలూరు మండలంలోని కూచిపూడి గ్రామంలో ఆర్‌సీఎం చర్చి అధ్వర్యంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ రెవరెండ్ అనిల్ కుమార్ దైవ సందేశమిచ్చారు. క్రీస్తు శిలువ మరణాన్ని వివరించారు. గ్రామస్తుడు పులివర్తి అఖిల్ కుమార్ ఏసుక్రీస్తు రూపధారుడై.. శిలువ మోస్తూ.. వీధుల్లో ప్రదర్శన ఇచ్చారు. ఫాదర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. కూచిపూడి గ్రామంలో ఏటా గుడ్ ఫ్రైడే రోజు ఏసుక్రీస్తు శిలువ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి ఫ్రాన్సిస్, భక్తులు పాల్గొన్నారు.



పీవీపాలెం: ప్రత్యేక ప్రార్థనలో మహిళలు



రేపల్లెరూరల్: ఆర్‌సీఎం చర్చిలో శిలువను మోస్తున్న పాస్టర్ జోజిరాజు



కొల్లూరు: లూథరన్ చర్చిలో..



శిలువ మోస్తున్న ఏసుక్రీస్తు వేషధారి

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రత్యేక చొరవ తీసుకోవటం జరిగిందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మరుప్రోలువారిపాలెం గ్రామంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి కోన రఘుపతికి విశేష స్పందన లభించింది. ప్రభుత్వం అందించిన పథకాలపై ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రచారంలో గ్రామస్తులు పార్టీ జెండాలను పట్టుకుని కలిసి నడిచారు. వైఎస్సార్ సీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, ఏడుకొండలరెడ్డి, నర్రావుల వెంకట్రావు, జోగి రాజా, కొక్కిలిగడ్డ చెంచయ్య, కోదండం ఉన్నారు.



మరుప్రోలువారిపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

1 నుంచి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు

కూచిపూడి(వేమూరు): నియోజకవర్గంలో ఏప్రిల్ 1 నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు శుక్రవారం తెలిపారు. అమర్తలూరు మండలం కూచిపూడి గ్రామంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ సాధించిన మెజార్టీ కన్నా..అధికంగా ప్రస్తుత ఎన్నికల్లో సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో నీటి ఎద్దడి నివారణకు సీఎం వైఎస్ జగన్ ఓలేరు గ్రామం వద్ద ప్రాజెక్ట్ ప్రారంభించడానికి అనుమతిచ్చారని, ఎన్నికల కోడ్ వల్ల శంకుస్థాపన పనులు ప్రారంభించలేక పోయామని తెలిపారు. పదేళ్లుగా ఇక్కడ మ్మెల్యేగా ఉన్న ఆనంద్‌బాబు నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. స్థానికంగా ఐటీఐ, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే నియోజకవర్గంలో మంజూరైన రోడ్లు వేయడం జరుగుతుందని అశోక్‌బాబు చెప్పారు. వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో విభేదాలున్నట్లు టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పార్టీ ఎలాంటి విభేదాలు లేవని, కలిసికట్టుగా ముందుకు సాగుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, సర్పంచ్ వుయ్యూరి అప్పిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గాదె శివరామ కృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు అనపురెడ్డి రఘురామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు

ఉమేష్‌చంద్రకు ఘన నివాళి

తెనాలిరూరల్: దివంగత ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్‌చంద్ర 58 వ జయంతిని శుక్రవారం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. తెనాలి సబ్‌డివిజన్ పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో చెంచుపేటలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, ఉమేష్ చంద్ర బంధువులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. తెనాలి డీఎస్పీ ఎం. రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోలీస్ అధికారులు, అభిమానులతో కలిసి ఉమేష్‌చంద్ర కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఉమేష్‌చంద్ర సేవలు స్ఫూర్తిదాయకమైనవని, ఆయన త్యాగం చిరస్మరణీయమైందని పేర్కొన్నారు. ఉమేష్‌చంద్ర మనమధ్య లేకపోయినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాట్లాడుతూ ఉమేష్ చంద్ర దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. మన ప్రాంతానికే గర్వకారణమైన వ్యక్తి అని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని మంచి కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐలు ఎస్.రమేష్‌బాబు, యం.దశరథ రామారావు, ఎస్సైలు, సిబ్బంది, ఉమేష్ చంద్ర కుటుంబ సభ్యులు జాస్తి భుజంగేశ్వరరావు, దేవాబక్తుని ఉమామహేశ్వరరావు, తాడిబోయిన శ్రీనివాసరావు, కంతేటి శ్రీరాజబాబు, అయినంపూడి కోటేశ్వరరావు, యడ్లపాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఉమేష్ చంద్ర విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ రమేష్, పోలీసు అధికారులు

‘టీడీపీకి ముస్లింలను ఓటు అడిగే అర్హత లేదు’

పెదకాకాని: గుంటూరులో జరిగిన నారా హమారా..టీడీపీ హమారా కార్యక్రమంలో ముస్లింలు యువకులు వారి సమస్యలు చెబుతుంటే అడ్డుకొని దేశద్రోహం కేసు పెట్టించిన టీడీపీకి ఓటు అడిగే అర్హత లేదని వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని అన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింకి కాకుండా పల్లె రఘునాథరెడ్డికి మైనారిటీ సంక్షేమ శాఖ ఇచ్చింది నారా చంద్రబాబునాయుడనే సంగతి ఇంకా మర్చిపోలేదన్నారు. నంబూరులోని మసీదు వద్ద శుక్రవారం ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం బడ్జెట్‌లో ముస్లింల సంక్షేమానికి రెండు వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించిందని తెలిపారు. 2019 నుంచి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కోవిడ్ కష్టకాలాన్ని కూడా లెక్క చేయకుండా 58 నెలలో ముస్లింల సంక్షేమం కోసం రూ. 22 వేల కోట్లు ఖర్చు పెట్టినట్లు వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ఇమామ్‌లకు, మౌజన్‌లకు ఆర్థికసాయం చేయడం గర్వకారణమని పేర్కొన్నారు. దుల్హన్ పథకం కింద ఆడపిల్లలకు లక్ష రూపాయలు అందించినట్లు తెలిపారు. ముస్లిం ఆడపిల్లల భవిష్యత్తును దూరదృష్టిలో ఆలోచించి 10వ తరగతి చదువుకుంటేనే దుల్హన్ వర్తిస్తుందని చెప్పిన సీఎం వైఎస్. జగన్మోహన్‌రెడ్డికి మైనార్టీలందరూ నీరాజనం పలికారని చెప్పారు.



మసీదు వద్ద మాట్లాడుతున్న గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడు సయ్యద్ సుభాని తదితరులు

ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించాలి: యూటీఎఫ్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లా. యూటీఎఫ్ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఏప్రిల్ 23తో పాఠశాలల పని దినాలు పూర్తికావస్తున్నాయని, ఈ లోపే ప్రతి ఉపాధ్యాయుడు తమ ప్రాంతంలో బడి ఈడు పిల్లల్ని గుర్తించి బడిలో చేర్పించాలని కోరారు. తల్లిదండ్రులు సైతం ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లల్ని చేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్.కుసుమకుమారి, రాష్ట్ర ప్రచురణల విభాగ చైర్మన్ ఎం. హనుమంతరావు, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఎం. కళాధర్, జి. విజయసారథి, ప్రధాన కార్యదర్శి ఏ. శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు జె.వినయ్ కుమార్, గుంటూరు జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సెప్సిస్ కారక సూక్ష్మజీవుల్ని గుర్తిస్తే చికిత్స సులభం

గుంటూరు మెడికల్: ప్రాణాంతక ఆరోగ్య సమస్యల్లో సెప్సిస్ ఒకటని, వ్యాధికారక సూక్ష్మక్రిములను గుర్తిస్తే చికిత్స చాలా సులభం అవుతుందని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు అన్నారు. ఐఎంఏ గుంటూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో, గురువారం సాయంత్రం జీఎంఏ హాలులో నిర్వహించిన నిరంతర వైద్య విద్యా కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. సభకు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఊపిరితిత్తుల వ్యాధులకు కారణమయ్యే సూక్ష్మజీవులే వల్లే సెప్సిస్ ప్రబలమవుతోందని తెలిపారు. సూక్ష్మజీవులను గుర్తించేందుకు అనేక రకాల పరీక్షలు ఉన్నాయని, వాటిలో కల్చర్‌తో పాటు పీసీఆర్ పరీక్ష కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. తొలిదశలోనే సెప్సిస్ కారక సూక్ష్మక్రిములను గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి రోగిని రక్షించవచ్చని తెలిపారు. డాక్టర్ నరేస్ రావెల సెప్సి స్ చికిత్సకు ఏ యాంటీబయాటిక్స్ మంచివి? అనే అంశంపై మాట్లాడారు. సూక్ష్మజీవులను గుర్తించక ముందు యాంటీబయాటిక్స్, గుర్తించిన తర్వాత యాంటీబయటిక్స్ ఎంచుకోవడంలో జాగ్రత్త వహించాలని చెప్పారు. యాంటీబయాటిక్స్ ఇవ్వకముందే కల్చర్, పీసీఆర్ పరీక్షలకు శాంపిల్స్ సేకరించాలని సూచించారు. ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ కె.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఒకే రకమైన యాంటీబయాటిక్స్ అందరికీ ఒకే విధంగా పని చేయవని తెలిపారు. వ్యక్తి శరీరతత్వాన్ని బట్టి, ఇంతకుముందు వాడిన యాంటీబయాటిక్స్ తదితర అంశాలపై పనితీరు ఆధారపడుతుందని తెలిపారు. సమావేశంలో ఐఎంఏ ఉపాధ్యక్షులు డాక్టర్ వెలగా మహేష్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ బాలనేని సాయికృష్ణ, సీనియర్ వైద్యులు డాక్టర్ జి. బాబూరావు, డాక్టర్ జి. వేణుగోపాల్ ,డాక్టర్ మద్దినేని జగదీష్ కుమార్ , ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు ఎలెక్ట్ డాక్టర్ జి. నందకిశోర్, వైద్యులు పాల్గొన్నారు .



నిరంతర వైద్య విద్యా కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లకు సర్టిఫికెట్ల పంపిణీ

రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణకు సత్కారం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై రామరాజు ఫౌండేషన్, యువకళా వాహిని సంయుక్త ఆధ్వర్యంలో సారిపల్లి కొండలరావు సారథ్యంలో శుక్రవారం ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణను సత్కరించారు. సభకు యువకళా వాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. సభలో మాజీ స్పీకర్ డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, మన్నవ సుబ్బారావు, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, జి. మల్లికార్జునరావు, డి. తిరుమలేశ్వరరావు పాల్గొని గుమ్మడి గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు. అనంతరం గుమ్మడి గోపాలకృష్ణ వివిధ పౌరాణిక నాటకాలలోని పద్యాల్ని రాగయుక్తంగా ఆలపించి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు.



గోపాలకృష్ణను సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నగరంపాలెం: అనధికారికంగా, అధిక ధరలకు మద్యం సీసాలు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని నగరంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం హనుమాన్‌నగర్‌లో ఉంటున్న ప్రకాశం జిల్లా పుచ్చకాయలపల్లి గ్రామానికి చెందిన ఏడుకొండలు కూలీ పనులకు వెళ్లేవాడు. అతను మద్యం దుకాణాల్లో సీసాలు కొనుగోలు చేసి, కేవీపీ కాలనీలో అధిక ధరలకు విక్రయించేవాడు. ఈ క్రమంలో పోలీసులు శుక్రవారం అతన్ని అరెస్ట్ చేసి, ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

చెట్టు నుంచి మంటలు

పట్నంబజారు: నగరంలోని లాడ్జిసెంటర్ సమీపంలో ఎల్‌ఈఎం స్కూల్ వద్ద ఉన్న చెట్టులో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అకస్మాత్తుగా తొర్రలో నుంచి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అదుపు చేశారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



రాష్ట్రంలో ప్రజారంజక పాలన

పిట్టలవానిపాలెం: ప్రజలకు మంచి జరిగితేనే.. తనకు ఓటు వేయండి అని ఎన్నికలకు వెళ్తున్న ఒకే ఒక్క నాయకుడిగా సీఎం వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతారని వైఎస్సార్ సీపీ నాయకుడు కోన నిఖిల్ అన్నారు. మండలంలోని పోతనకట్టవారిపాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ ఎనుముల శివపార్వతీ, నాయకుడు కోటేశ్వరరావుతో వైఎస్సార్ సీపీ బాపట్ల అభ్యర్థి కోన రఘుపతి తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ ప్రజారంజక పాలన అందించారని, ప్రజలంతా మరోసారి ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బాపట్ల ఎమ్మెల్యేగా కోన రఘుపతిని మూడోసారి గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, నాయకులు శ్యామల నాగిరెడ్డి, మండే విజయ్‌కుమార్, అహ్మద్‌హుస్సేన్, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కుంతం ప్రసన్నరాజు, మండే విజయ్‌కుమార్, కోటిరెడ్డి, బడుగు ప్రకాశరావు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నేడు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

సీనియర్ కమ్యూనిస్టు నేత ఖాదర్‌వలి మృతి

కాకుమాను: సీనియర్ కమ్యూనిస్టు, రైతు కూలి నాయకుడు షేక్ ఖాదర్‌వలి(89) గురువారం అర్ధరాత్రి అనారోగ్య కారణంతో మృతి చెందారు. ఆయన యుక్త వయస్సు నుంచే కమ్యూనిస్టు ఉద్యమాలలో పాల్గొన్నారు. 1948 నుంచి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో పాత బాపట్ల తాలూకా కమిటీ సభ్యునిగా ఉంటూ పేదల అభ్యున్నతి కోసం ఆయన పోరాడారు. కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, పలువురు రైతు సంఘ నాయకులు ఆయనకు నివాళులర్పించారు.

విద్యుత్ షాక్‌కు గురై బాలుడి మృతి

నగరంపాలెం: విద్యుత్ షాక్‌కు గురై బాలుడు మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం ఎన్టీఆర్ కాలనీలో జరిగింది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతి రోడ్ ఎన్టీఆర్ కాలనీ ఒకటో వీధిలో ఉంటున్న ఎల్.మేరి కూలీ పనులకు వెళుతుంటుంది. ఆమెకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అందులో నాలుగో వాడైన మహేష్ (11) మూడో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద పిల్లలతో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్లాస్టిక్ కర్ర పైనున్న విద్యుత్తు తీగలపై పడింది. దీంతో డాబా పైకెక్కి దాన్ని తీసుకునేటప్పుడు మహేష్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఆపస్మారక స్థితిలో ఉన్న అతడ్ని వెంటనే జీజీహెచ్ ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. వైద్యులు పరిక్షించి అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహన్ని పరీక్షలు నిమిత్తం శవగారానికి తరలించారు. అరండల్‌పేట పీఎస్ ఎస్‌ఐ ప్రసన్న కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారులో తరలిస్తున్న రూ. 2 లక్షలు పట్టివేత

నగరపాలెం: కారులో తరలిస్తున్న రూ. 2లక్షలను పోలీసులు పట్టుకున్నారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జేకేసీ కాలేజీ రోడ్డులో శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో సత్తెనపల్లికి చెందిన టి.లక్ష్మయ్య కారులో రూ. 2 లక్షలను ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తుండటంతో, సీజ్ చేసి ట్రజరీ శాఖకు అప్పజెప్పారు. తనిఖీల్లో సీఐ విజయచంద్ర, ఎస్‌ఐ ఏక్‌నాథ్, సిబ్బంది పాల్గొన్నారు.